**విలేకరులు కావలెను**

మనవార్త దినపత్రిక లో పనిచేయుటకు విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల వారిగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను

Cell:9247819181, 8309605189



TITLE Code TEL TEL12230

# మన వార్త

ప్రజాగళానికి అక్షర రూపం

MANA VAARTHA





హైదరాబాద్,కరీంనగర్,పెద్దపల్లి,రాజన్న సిరిసిల్ల    గురువారం 11 జులై 2024    పేజీలు : 4 వెల : రూ.2


## రామసేతు పరిశోధనలో ముందడుగు..



**మన వార్త** రామసేతు వంతెనకు సంబంధించి పూర్తి మ్యాప్‌ను 'ఇస్రో' సైంటిస్టులు ఆవిష్కరించారు.రామేశ్వరం నుంచి శ్రీలంకలోని మన్నార్ దీవిని కలుపుతూ సముద్రంలో ఉన్న వంతెన నిర్మాణ తీరుపై పరిశోధకులు కొత్త విషయాలు కనుగొన్నారు. వంతెనలోని 99.8శాతం సముద్రపు నీళ్లలో మునిగిపోయి ఉందని పరిశోధనలో తేలింది.నాసాకు చెందిన 'ఐసీఈశాట్-2' శాటిలైట్ డాటాను ఉపయోగించి, జోధ్‌పూర్, హైదరాబాద్ నేషనల్ రిమోట్ సెన్సింగ్ కేంద్రాలకు చెందిన సైంటిస్టులు 'రామసేతు' మ్యాపింగ్ ప్రక్రియను చేపట్టారు. వంతెన నిర్మాణం ఏ కాలం నాటిదన్నది తెలుసుకునేందుకు ఈ పరిశోధన దోహదపడుతుందని సైంటిస్టులు భావిస్తున్నారు.

## ఉపాధ్యాయులపై ఫోకస్ చేసిన సీఎం రేవంత్ రెడ్డి...




**మన వార్త** ప్రభుత్వ ఉపాధ్యాయులకు సీఎం రేవంత్ హెచ్చరికలు జారీ చేశారు. ఇకపై తానే స్వయంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని స్పష్టం చేశారు.ఏ స్కూల్లోనైనా ఉపాధ్యాయులు లేకపోతే చర్యలుంటాయని అన్నారు. ఉద్యోగులకు మొదటి తారీఖున జీతాలిస్తున్నామని, వేతనం తీసుకుంటున్నారు కాబట్టి తప్పనిసరిగా పనిచేయాలన్నారు. తప్పుంటే ఉన్నతాధికారులపైనైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. సెక్రటేరియట్ నుంచి పంచాయతీ వరకు ఫేస్ రికగ్నిషన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

## ఓయూలో మీడియాపై పోలీసుల దాడి



– ఇది మీడియా స్వేచ్ఛను కాలరాయడమే అవుతుంది టీజేఎఫ్

హైదరాబాద్ **మన వార్త** : ఉస్మానియా యూనివర్సిటీ మెయిన్ లైబ్రరీ వద్ద మీడియా ప్రతినిధుల పట్ల పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. డీఎస్సీ అభ్యర్థుల ఆందోళనలను కవరేజ్ చేసేందుకు వెళ్లిన జీ తెలుగు రిపోర్టర్ పట్ల పోలీసులు అమర్యాదగా ప్రవర్తించారు. జీ తెలుగు రిపోర్టర్ చొక్కా పట్టుకుని లాక్కెళ్లారు. నేను జర్నలిస్టును మీ పని మీరు చేసుకోండి మా పని మేం చేసుకుంటాం అంటుంటే కూడా పోలీసులు వినిపించుకోలేదు. ఆ రిపోర్టర్‌ను బలవంతంగా పోలీసు వాహనంలో ఎక్కించి పోలీసులు తమ పైత్యాన్ని ప్రదర్శించారు. జర్నలిస్టుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును టీజేఎఫ్ తీవ్రంగా ఖండిస్తుంది. విధి నిర్వహణలో భాగంగా జర్నలిస్టులు వార్తలు కవర్ చేయడానికి వెళ్తే పోలీసులు అరెస్ట్ చేయటమేంటి..? కనీసం మీడియా ప్రతినిధులు అనే సోయి లేకుండా పోలీసులు వ్యవహరించిన తీరు చూస్తుంటే మీడియా స్వేచ్ఛను కాలరాయడమే అవుతుంది. జర్నలిస్టుల పట్ల పోలీసులు అనుసరిస్తున్న నిరంకుశ వైఖరిని మార్చుకోవాలని తెలంగాణ జర్నలిస్టుల ఫోరమ్ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తుంది. అదుపులోకి తీసుకున్న జర్నలిస్టులను తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ జర్నలిస్టు ఫోరం అధ్యక్షుడు పల్లె రవికుమార్ గౌడ్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ మహేశ్వరం మహేంద్ర డిమాండ్ చేశారు.

## ఆస్ట్రియా పర్యటనలో నరేంద్ర మోడీ..



**మన వార్త** ప్రధాని నరేంద్ర మోడీ రష్యా పర్యటన అనంతరం మంగళవారం రాత్రి ఆస్ట్రియా చేరుకున్నారు. మాస్కో నుంచి వియన్నా చేరుకున్న ఆయనకు ఆస్ట్రియన్ చాన్సలర్ నెహమ్మర్ ఘన స్వాగతం పలికారు.మోడీ తన పర్యటనలో భాగంగా ఆస్ట్రియా అధ్యక్షుడు అలెగ్జాండర్ వాన్ డెర్ బెల్లెన్, చాన్సలర్ కార్ల్ నెహమ్మర్‌తో భేటీ అవనున్నారు. రెండు దేశాల ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం, అనేక భౌగోళిక రాజకీయ సవాళ్లపై చర్చించనున్నారు. ఆస్ట్రియా పర్యటనకు ముందు మోడీ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, న్యాయ పాలన ఉమ్మడి విలువలు కలిగిన రెండు దేశాలు ఎప్పటికీ సన్నిహిత భాగస్వామ్యాన్ని నిర్మించడానికి పునాదిగా ఉన్నాయన్నారు. కాగా, 40 ఏళ్లలో భారత ప్రధాని ఆస్ట్రియాలో పర్యటించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.1983లో ఆ దేశాన్ని చివరి సారిగా ఇంధిరా గాంధీ సందర్శించారు.

# తెలంగాణ డీజీపీగా జితేందర్ నియామకం

– రవిగుప్తా ను హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బదిలీ



తెలంగాణ రాష్ట్ర డీజీపీగా జితేందర్ నియామకయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం డీజీపీగా కొనసాగుతున్న రవిగుప్తాను హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బదిలీ చేసింది. జితేందర్ 1992 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి. ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిర్మల్ ఏఎస్పీగా పని చేశారు. ఆ తర్వాత బెల్లంపల్లి అదనపు ఎస్పీగా విధులు నిర్వర్తించారు. నక్సల్స్ ప్రభావం ఎక్కువగా ఉన్న మహబూబ్‌నగర్, గుంటూరు జిల్లాకు ఎస్పీగానూ సేవలందించారు. ఢిల్లీలో సీబీఐలో కొంతకాలం పనిచేశారు. 2004-06 మధ్య గ్రేహౌండ్స్ బాధ్యతలుచేపట్టారు. విశాఖపట్నం రేంజ్ డీఐజీగా బాధ్యతలు నిర్వర్తించారు. తెలంగాణ ఉద్యమం సమయంలో వరంగల్ రేంజ్ డీఐజీగా పనిచేశారు. ఏపీ సీఐడీ, ఎంక్వైరీ కమిషన్, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్‌లో పని చేశారు. హైదరాబాద్ కమిషనరేట్‌లో అదనపు ట్రాఫిక్ కమిషనర్, తెలంగాణ శాంతిభద్రతల విభాగం అదనపు డీజీపీగా, జైళ్లశాఖ డీజీగా పని చేశారు. ప్రస్తుతం ఆయన హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా కొనసాగుతున్నారు. వచ్చే ఏడాది సెప్టెంబర్‌లో పదవీ విరమణ చేయనున్నారు.

## ఎమ్మెల్యేకు వాస్తు భయం



హైదరాబాద్ **మన వార్త** : ఇటీవలే నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు భవనానికి సిట్టింగ్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మరమ్మత్తులు చేయించడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ భవనానికి వాస్తు బాగా లేకపోవడం వల్లే అపశృతులు చోటు చేసుకుంటున్నాయని భావించి, వాటికి అనుకూలంగా మరమ్మత్తులు చేయిస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. హుజూరాబాద్ నుండి అప్రతిహతంగా గెలుస్తున్న ఈటల రాజేందర్ ఈ క్యాంపు అందుబాటులోకి షిఫ్ట్ అయిన తరువాత ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్నారనే వాదన స్థానికంగా వినిపిస్తోంది. కొత్తగా నిర్మించిన ఈ భవనంలోకి మారిన తరువాత మంత్రివర్గంలో స్థానం కోసం ఊగిసలాడడం, ఆ తర్వాత పార్టీ నుంచి బయటకు రావడం, ఉప ఎన్నికలకు వెల్లడం, జనరల్ ఎన్నికల్లో ఓటమి పాలు కావడం వంటి చర్యలు కూడా క్యాంప్ కార్యాలయానికి వాస్తు లేకపోవడమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. క్యాంపు ఆఫీసుకు సమీపంలో విద్యుత్ సబ్ స్టేషన్ ఉండటంతో పాటు భవనంలోని డోర్లు ఏర్పాటు చేయాల్సిన చోట చేయకపోవడం వల్ల ఇందులో నివసించే వారికి భవిష్యత్తులో ఆటంకాలు ఎదురవుతాయన్న వాదనలు బలంగా వినిపించాయి. దీంతో ఈసారి ఎన్నికల్లో గెలిచిన కౌశిక్ రెడ్డి క్యాంప్ ఆఫీసులో కార్యకలాపాలు కొనసాగేందుకు వెనక ముందు ఆలోచించారని పార్టీ వర్గాలు అంటున్నాయి. ఈ నేపథ్యంలోనే హుజురాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు భవనంలోనే మరమ్మత్తులు ప్రారంభం కానున్నాయి. భవనాన్ని వాస్తుకు అనుగుణంగా సెట్ చేసిన తరువాత సిట్టింగ్ ఎమ్మెల్యే గృహ ప్రవేశం చేయనున్నట్టు సమాచారం. అందుకే గెలిచి ఆరు నెలలు అవుతున్న ఇప్పటి వరకు క్యాంపు ఆఫీస్ లో అడుగు పెట్టలేదట. విశాలంగా క్యాంపు ఆఫీస్ ఉన్నప్పటికీ.. ఇక్కడికి మాత్రం రావడం లేదట. వీణవంక తన స్వంత ఇంట్లోనే బస చేస్తున్నారు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి. మరోవైపు మంచిగా ఉన్న క్యాంపు ఆఫీస్ కి మరమ్మతులు చేయించడంపై విమర్శలు వస్తున్నాయి. మొత్తానికి రాజకీయ పార్టీ నేతలకు వాస్తు భయం పట్టుకుంది.


మన వార్త
ప్రజాగళానికి అక్షర రూపం
MANA VAARTHA

epaper
చదవడానికి QR కోడ్‌ను స్కాన్ చేయండి
http://manavaartha.net

MANA VAARTHA


## ఇందిరమ్మ రాజ్యంలో జర్నలిస్టులకు రక్షణ లేదా..?



హైదరాబాద్ : ఉస్మానియా యూనివర్సిటీ మెయిన్ లైబ్రరీ వద్ద డీఎస్సీ అభ్యర్థుల ఆందోళనలను కవరేజ్ చేసేందుకు వెళ్లిన జీ న్యూస్ రిపోర్టర్ పట్ల పోలీసులు అమర్యాదగా ప్రవర్తించిన సంగతి తెలిసిందే. జీ న్యూస్ రిపోర్టర్ చొక్కా పట్టుకుని పోలీసులు లాక్కెళ్లారు. నేను జర్నలిస్టును.. మీ పని మీరు చేసుకోండి.. మా పని మేం చేసుకుంటాం అంటుంటే కూడా పోలీసులు వినిపించుకోకుండా, బలవంతంగా పోలీసు వాహనంలో ఎక్కించారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ సర్కార్‌పై ఆయన నిప్పులు చెరిగారు.ఉస్మానియా యూనివర్సిటీలో జీ న్యూస్ రిపోర్టర్, కెమెరామెన్‌లను అక్రమంగా అరెస్టు చేయడం దారుణం అని కేటీఆర్ మండిపడ్డారు. విధి నిర్వహణలో భాగంగా జర్నలిస్టులు వార్తల కవరేజీకి వెళ్లడం నేరమా..? డీఎస్సీ అభ్యర్థుల నిరసన చూపిస్తే పాపమా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. నిన్న బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద ఓ మహిళా జర్నలిస్టుతో కూడా పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. ఇవాళ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జీ న్యూస్ రిపోర్టర్ గల్లాపట్టి అక్రమ అరెస్టు చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో జర్నలిస్టులకు రక్షణ లేదా..? ప్రజాపాలన అంటే జర్నలిస్టులపై జబర్దస్తీ చేయడమా..?ఉస్మానియా యూనివర్సిటీలో ఎందుకింత నిర్బంధం..? అని నిలదీశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటినుంచి ఉస్మానియాలో ఉద్యమం నాటి దృశ్యాలు కనిపిస్తున్నాయి. మళ్లీ పోలీసుల బూట్ల చప్పుళ్లు, ముళ్లకంచెలు అడగడుగునా దర్శనమిస్తున్నాయి. జర్నలిస్టుల పట్ల పోలీసుల వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రజాస్వామ్యంలో పత్రికాస్వేచ్ఛను హరిస్తే సహించే ప్రసక్తే లేదు. వెంటనే జీన్యూస్ జర్నలిస్టులను బేషరతుగా విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తాసిల్దారుకి వినతిపత్రం





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జులై 10 (మన వార్త ప్రతినిధి సిహెచ్ వెంకటేశ్వర్లు)**తే కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తాసిల్దారుకి వినతిపత్రం.కోరికల దినం డిమాండ్స్ డే సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలి కార్మికులందరికీ కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలి. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. హమాలి మరియు ట్రాన్స్పోర్ట్ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి. గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలి జీవో నెంబర్ 51 సవరించాలి భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు లోని సౌకర్యాలు పటిష్టంగా అమలు చేయాలి అని కొత్తగూడెం తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తరువాత తాసిల్దారుకి వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియుసి జిల్లా నాయకులు మరియు మండల నాయకులు పాల్గొన్నారు.

## గాంధీ చౌరస్తా ప్రహారీ ధ్వంసం..



**-నెల దాటిన పట్టింపు లేదు...**
**-విద్యుత్ దీపాలు నేల చూపులు...**

**జమ్మికుంట, జూలై 10( మన వార్త ప్రతినిధి):** జమ్మికుంట మున్సిపాలిటీ అయిన తరువాత పట్టణం సుందరీకరణలో భాగంగా స్థానిక గాంధీ చౌరస్తాలోని గాంధీ విగ్రహం చుట్టూ ప్రహరిని లక్షలు వెచ్చించి అందంగా తీర్చి దిద్దారు.అదేవిదంగా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు.విద్యుత్ దీపాల వెలుతురులలో చౌరస్తా పట్టానికే వన్నె తెచ్చింది. నెల రోజుల క్రితం గాంధీ విగ్రహం చుట్టూ ఉన్న ప్రహరి ద్వంసానికి గురైంది.విద్యుత్ దీపాలు నేలచూపులు చూస్తున్నాయి.నిత్యం అటుప్రక్క నుంచి వెళ్లే అధికారులు,ప్రజాప్రతినిధుల కంట పడకపోవడం శోచనీయం.దీనితో సుందరీకరణ కళ చెదిరి చౌరస్తా అందవికారంగా కనిపిస్తుంది.నెల రోజులు దాటినా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించక పోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ధ్వంసానికి గురైన ప్రహారికి మరమత్తులు చేసీ,విద్యుత్ దీపాలను సరిచెయించాలని అధికారులను,ప్రజాప్రతినిధులను ప్రజలు కోరుతున్నారు.

## బోడుప్పల్ అనఘాపురి కాలనీలో జోరుగా అక్రమ నిర్మాణాలు



**- అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న కార్పోరేటర్ భర్త బృందం.**
**- పట్టించుకోని మున్సిపల్ అధికారులు.**

**హైదరాబాద్ ఇన్చార్జి భాస్కర్ చారి, జులై 11, (మన వార్త)** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి నాలుగవ డివిజన్ అనఘాపురి కాలనీ, ఎన్ఐఎన్ కాలనీలలో, జోరుగా అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి. ఈ డివిజన్లో ఏ గల్లిలో చూసిన అక్రమ నిర్మాణమే దాదాపు ఈ నాలుగవ డివిజన్లోనే పదుల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు ఉన్నాయి. కొన్ని నూతన అక్రమ నిర్మాణాలు అయితే మరికొన్ని పాత ఇల్లు మీదనే రెండంతస్తులు మూడు అంతస్తులు అక్రమంగా నిర్మాణాలు. ఈ అక్రమ నిర్మాణాల వెనుక కార్పొరేటర్ భర్త హస్తం ఉందని పలువురు గుసగుసలాడుతున్నారు. ఈ నాలుగవ డివిజన్లో కొంతమేరకు వక్ఫ్బోర్డు భూములు ఉన్నాయి. ఈ వర్క్ బోర్డ్ లో ఉన్నటువంటి ఫ్లాట్లకు ఇలాంటి అనుమతులు లేకుండా ఏకంగా రెండు అంతస్తులు మూడు అంతస్తుల అక్రమ నిర్మాణాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ వర్క్ బోర్డులో ఉన్నటువంటి ఫ్లాట్లకు అనుమతి రాదు కనుక ఇదే అదునుగా చూసుకొని కార్పోరేటర్ భర్త తో సహా మున్సిపల్ అధికారులు కూడా భారీగానే దండుకుంటున్నారనే సమాచారం. మున్సిపల్ ఆదాయానికి సహకరించాల్సిన అధికారులు సైతం భారీగానే ముడుపులు తీసుకుంటూ చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ ఇలాంటి అనుమతి లేని అక్రమ నిర్మాణాల మీద చర్యలు తీసుకొవాలని, అలాగే ముడుపులు తీసుకున్న అధికారులను విధుల నుండి బహిష్కరించాలని కోరుతున్న అక్కడి ప్రజలు కోరుతున్నారు.

## తెలంగాణ స్పోర్ట్స్ కార్పొరేషన్ చైర్మన్ కు వెల్లువెత్తిన శుభాకాంక్షలు..



**జమ్మికుంట జులై 10 (మన వార్త ప్రతినిధి):** తెలంగాణ స్పోర్ట్స్ కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన యవజన కాంగ్రె స్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేన రెడ్డి నీ టిపిసిసి సెల్ మాజీ జాయింట్ కన్వీనర్ దొంత రమేష్, ఇల్లంతకుంట శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మన్ దేశిని కోటి హైదారాబాద్ లో ఆయనను మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు.

## సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలి..




**-సిఐ రవి...**

**జమ్మికుంట, జూలై 10( మన వార్త ప్రతినిధి):** సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జమ్మికుంట పట్టణ సీఐ వరగంటి రవి ప్రజలకు సూచించారు. జమ్మికుంట మండలం అంకుసాపూర్ గ్రామస్తులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.వ్యసనాలకు బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని,చెడు మార్గంలో వెళ్లకుండా యువతకు పలు సూచనలు ఇచ్చినారు. మైనర్ డ్రైవింగ్ , సీసీ కెమెరాలు, డ్రగ్స్ మీద తగు సూచనలు చేసినారు.

# ఘనంగా కేకే జన్మదిన వేడుకలు



**గంభీరావుపేట జూలై 10 (మన వార్త ప్రతినిధి)** గంభీరావుపేట మండల కేంద్రంలో గాంధీ చౌక్ వద్ద మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ ఆధ్వర్యంలో కేకే మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేయడం జరిగింది గంభీరావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు మరియు బ్రేడ్స్ పంపిణీ చేయడం జరిగింది. తదనంతరం హమీద్ యువసేన ఆధ్వర్యంలో రక్తదానం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుంచి సిరిసిల్ల నియోజకవర్గ ప్రజలే తన ఊపిరిగా జీవిస్తూ వారి అభివృద్ధి కోసం అనేక పోరాటాలు చేస్తూ గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రజలకు అండదండగా ఉంటూ ప్రజల సేవలో నిరంతరం ఉంటూ సిరిసిల్లనియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్న కేకే మహేందర్ రెడ్డికి గంభీరావుపేట కాంగ్రెస్ శ్రేణుల నుండి మరియు గంభీరావుపేట మండల ప్రజల తరఫునుంచి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు వారు ఆరురారోగ్యాలతో అష్ట ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని భగవంతుని ప్రార్థించారు . ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తున్న కేకే మహేందర్ రెడ్డికి రానున్న రోజుల్లో మంచి పదవి వరించబోతుందని జోష్యం చెప్పారు ఇట్టి కార్యక్రమంలో రక్తదానం చేసిన వారు మహమ్మద్ హమీద్ చంద్రశేఖర్ గౌడ్ గుడి కాడి కుమార్ అజ్మీర భాస్కర్ బిచ్చల సతీష్ రెడ్డి మమ్మద్ అన్వర్ దోసెల వంశీ సందీప్ జోగు బాలకృష్ణ రాజలింగం అంబటి నవీన్ బాబు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పాపా రాజు గౌడ్ జిల్లా యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గంగి స్వామి మైనార్టీ సెల్ అధ్యక్షులు మొహమ్మద్ యాదుల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి మూల రామచంద్రారెడ్డి వివిధ గ్రామ శాఖ అధ్యక్షులు సతీష్ రెడ్డి శ్రీనివాస్ మేడ భాస్కర్ కూడలి లక్ష్మయ్య ఒరుగంటి నర్సింలు విటల్ నాయక్ బలరాం రెడ్డి సంతోష్ గౌడ్ బోన్ల సత్యం గంగాధర్ గౌడ్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాజబోయిన లచ్చయ్య కిషన్ గౌడ్ ఏడ పోయిన ప్రభాకర్ అక్క పెళ్లి రాజనర్సింహారెడ్డి ఎర్ర నరసయ్య వేషాల ఎంకటి ఇగ దండి మహేష్ నాంపల్లి పిట? వెంకటి మల్యాల రాజ్వీర్ గుడికాడ బాలయ్య అక్క పెళ్లి బాలయ్య మహమ్మద్ ఆజాద్ పెద్దవేని రాజ మల్లయ్య మహమ్మద్ తాజుద్దీన్ ఎల్లె బాబురావు ఎల్లే బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు

## రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్గా బాధ్యతలు చేపట్టిన జనక్ ప్రసాద్



**మంచిర్యాల్ జూలై 10 (మన వార్త ప్రతినిధి)** తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్గా నియమితులైన ఐఎన్టిసి సెక్రటరీ జనరల్ ప్రసాద్ బుధవారం హైదరాబాదులో ప్రమాణస్వీకారం చేశారు ఈ సందర్భంగా బెల్లంపల్లి రీజన్లోని మందమర్రి శ్రీరాంపూర్ బెల్లంపల్లి కి చెందిన ఐ ఎన్ టి సి నాయకులు పెద్ద సంఖ్యలో హైదరాబాదుకు తరలి వెళ్లారు. జనక్రసాద్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులను కార్యకర్తలను ఉద్దేశించి వేతనాల సలహా మండలి చైర్మన్ జన ప్రసాద్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ప్రభుత్వం ఈ పదవి కట్టబెట్టిందని పేర్కొన్నారు. ప్రభుత్వం తనపై పెట్టిన నమ్మకాన్ని ఏమాత్రం వాము చేయకుండా సంఘటిత అసంఘటిత రంగాల కార్మికుల వేతనాల అమలుకు సంబంధించి ప్రణాళిక బద్దంగా పనిచేస్తానని చెప్పారు .ఇప్పటికే రాష్ట్రంలో ఆయా పరిశ్రమల్లో పని చేస్తున్నటువంటి కార్మికులు కాంట్రాక్టర్ల వివరాలను తీసుకోవడం జరిగిందని చెప్పారు. ప్రభుత్వ జీవో ప్రకారంగా కార్మికులకు వేతనాలు అమలు చేయాల్సిందేనని చెప్పారు. అంతేకాకుండా నిబంధనలు ఉల్లంఘించే కాంట్రాక్టర్లను ఉపేక్షించే పరిస్థితులు ఉండబోవని తెలిపారు. నాలుగున్నర దశాబ్దాలుగా కార్మిక రంగానికి చేసిన సేవలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మంత్రులు శ్రీధర్ బాబు లకు రుణపడి ఉంటానని తెలిపారు. తనపై అభిమానంతో వచ్చినటువంటి నాయకులకు కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ఇదేవిధంగా తనపై ప్రేమానురాగాలు చూపాలని కోరారు .ఈ సందర్భంగా ఐఎన్టిసి కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపల్లి సమ్మయ్య మాట్లాడుతూ కార్మిక రంగంలో నాలుగున్నర దశాబ్దాల అపార అనుభవం ఉన్నటువంటి తమ నేతకు ఈ పదవి రావడం కార్మిక వర్గానికి మేలు జరుగుతుందని పేర్కొన్నారు. అసంఘటిత రంగాల సంక్షేమం కనీస వేతనాలు అమలు చేసే విధంగా తమ అధినేత జనక్ ప్రసాదు పని చేస్తారని చెప్పారు. కాంగ్రెస్లో కష్టపడే నాయకులకు తగిన గుర్తింపు ఉంటుంది అనడానికి తమ అధినేత జర ప్రసాదు నిదర్శనం అని తెలిపారు సింగరేణి వ్యాప్తంగా సంబరాలు చెప్పారు. మంచి పేరు తీసుకురావడంతో పాటు సింగరేణి వ్యాప్తంగా ఐ ఎన్ టి సి మరింత బలోపేతం కావడానికి ఆయన కృషి చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టిసి నాయకులు దేవి భూమయ్య రామ్ శెట్టి నరేందర్ మిట్ట సూర్యనారాయణ పుల్లూరు లక్ష్మణ్ వెంకటస్వామి అన్ని గనుల ఫిట్ కార్యదర్శిలు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**మల్కాజ్గిరి జిల్లా జూలై 9 (మన వార్త ప్రతినిధి:అంతోని)** మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని చెరువుల మీద సంబధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని చెరువుల స్థలాలు రక్షణకు,సుందరీకరణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు కొన్ని సూచనలు చేసారు. ఆగిపోయిన అభివృద్ధి పనులను పునర్ప్రార్భించేందుకు కొత్త అభివృద్ధి పనుల కొరకు ప్రపోజల్ తయారు చేసుకోవాలని, పూర్తి అయిన పనుల నాణ్యతపై క్వాలిటీ కంట్రోల్ అధికారుల నుండి పూర్తి సమాచారం తనకు అందించాలని సూచించారు.చెరువుల కబ్జాలు నివారించేందుకు చర్యలు తీసుకోలని, వచ్చే వర్ష కాలంలో ప్రజలు ఇబ్బంది లేకుండా చూడాలని, గుర్రపు డెక్క తొలగింపు పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఈ సీజన్ లో దోమల ద్వారా వచ్చే డెంగ్యూ వ్యాధిపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని, మల్కాజిగిరి అల్వాల్ సర్కిల్ లో దోమల బెడద తీవ్రంగా ఉన్నందున ఫాగింగ్, ఆంటీ లార్వా స్ప్రే విస్తృతంగా పిచికారి చేయాలని, అనేక అంశాల పై సంబధిత అధికారులతో చర్చించానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డిపార్ట్మెంట్ ఈ ఈ.నారాయణ, ఎ ఈ.పృధ్వీ, రెవెన్యూ డిపార్ట్మెంట్ మల్కాజిగిరి డిప్యూటీ తహసీల్దర్ అనంతలక్ష్మి, అల్వాల్ డిప్యూటీ తహశీల్దార్ రోజా, ఆర్ ఐ.శ్రీశైలం, విశ్వనాథ్,సర్వేయర్ లు వెంకటేష్, ప్రశాంత్,హెచ్ఎండిఏ ఎ ఈ.శివా రెడ్డి, ఎంటోమొలజీ ఎ ఈ.వనజ, ఫీల్డ్ అసిస్టెంట్లు వేణు, నజీర్ పాటు ఆల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి, నేరేడ్ మెట్ కార్పొరేటర్ మీనా ఉపేందర్ రెడ్డి, మాజీ మల్కాజిగిరి కార్పొరేటర్ జగదీష్ గౌడ్, సీనియర్ నాయకులు మేకల రాము యాదవ్, జీకే హనుమంత రావు, మధుసూదన్ రెడ్డి, డోలి రమేష్, శ్రీనివాస్ గౌడ్, వంశీ ముదిరాజ్, మల్లేష్ గౌడ్, ఇబ్రహీం, పవన్, అరుణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## అగ్రహారం అంజన్న దేవాలయంలో హుండీ లెక్కింపు..



**వేములవాడ, జూలై 10 (మన వార్త ప్రతినిధి నందు రావు):** అగ్రహారం శ్రీ హనుమాన్ దేవాలయం లో బుధవారం హుండీ లెక్కింపు చేశారు. ఇట్టి హుండీ లెక్కింపులో 3,83,477 రూపాయలు ఆదాయం సమకూరినట్టు ఆలయ అధికారులు తెలిపారు. ఇట్టి లెక్కింపు పర్యవేక్షణ నిమిత్తం పి.సత్యనారాయణ పరిశీలకులు దేవాదాయ శాఖ కరీంనగర్, ఆలయ వ్యవస్థాపక వంశీయ ధర్మకర్త గౌరీశెట్టి మహేందర్, ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎండపల్లి మారుతి, ఆలయ సిబ్బంది, సత్య సాయి సేవాసమితి సిరిసిల్ల శాఖ పాల్గొన్నారు.

# అలాంటి పాత్ర చేయాలని ఉంది..



అందాల ముద్దు గుమ్మ రీతు వర్మ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. ఈమె పెళ్లి చూపులు సినిమాతో హీరోయిన్ గా మంచి గుర్తింపును సంపాదించుకుంది. ఆ తర్వాత వరుసగా సినిమా అవకాశాలను దక్కించుకుంటూ వెళుతుంది. ఇకపోతే ఈమె తెలుగు తో పాటు ఇప్పటికే అనేక ఇతర భాష సినిమాలలో కూడా నటించి మంచి గుర్తింపును సంపాదించుకుంది. కెరియర్ లో ఇప్పటి వరకు చాలా సినిమాలలో నటించిన ఎక్కువ శాతం గ్రామర్ షో పాత్రల వైపు వెళ్లకుండా క్లాస్ అండ్ డీసెంట్ పాత్రలలోనే ఎక్కువ శాతం కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇకపోతే ఈ బ్యూటీ కి ఓ పాత్రలో నటించాలని చాలా కోరికగా ఉందట. ఆ పాత్ర ఏమిటి అనే వివరాలను ఈమె తాజాగా ఓ ఇంటర్వ్యూలో భాగంగా చెప్పుకొచ్చింది. తాజా ఇంటర్వ్యూ లో భాగంగా రీతూ వర్మ తన డ్రీమ్ రోల్ గురించి చెబుతూ ... నాకు స్పై ఏజెంట్ పాత్రలో నటించాలని ఉంది అని ఈమె చెప్పింది. అలాగే ఎవరైనా “స్పై” ఏజెంట్ పాత్ర కథను నాకు చెప్పినట్లు అయితే దాదాపుగా ఆ సినిమా చేయడానికి నేను ప్రయత్నిస్తాను అని ఈ బ్యూటీ తాజా ఇంటర్వ్యూ లో తెలియజేసింది. మరి ఎవరైనా ఈ బ్యూటీ కోసం అదిరిపోయే స్టైలిష్ యాక్షన్ ఎంటర్టైనర్ తో కూడిన స్పై అజెంట్ పాత్రను డిజైన్ చేస్తారేమో చూడాలి. ఇకపోతే ప్రస్తుతం రీతూ వర్మ , శ్రీ విష్ణు హీరోగా హసిత్ గోలి దర్శకత్వంలో రూపొందుతున్న స్వాగ్ అనే సినిమాలో హీరోయిన్ గా నటిస్తోంది. ఇప్పటికే ఈ సినిమా నుండి ఈ బ్యూటీ కి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్ ను కూడా విడుదల చేశారు. దానికి ప్రేక్షకుల నుండి మంచి రెస్పాన్స్ లభించింది. మరి ఈ సినిమాతో ఈమెకు ఏ స్థాయి విజయం దక్కుతుందో తెలియాలి అంటే మరి కొంత కాలం వేచి చూడాల్సిందే.

# కుక్కల బెడదపై మున్సిపల్ చర్యలు..



**జమ్మికుంట, జులై10( మన వార్త ప్రతినిధి )** కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో కుక్కలతో ఇబ్బంది పడుతున్న స్థానిక ప్రజలకు ఉపశమనం కలిగింది. ముఖ్యంగా చిన్న పిల్లలు,వృద్దులు ఇటీవల చాలా ప్రాంతాలలో కుక్కల దాడికి గురవుతున్న సందర్భంలో పట్టణంలో పలు ప్రాంతాలలో కుక్కల స్వైర విహారంతో స్థానిక ప్రజలు ఇబ్బంది గురయ్యారు. ఈ విషయంపై పలువురు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన మున్సిపల్ అధికారులు , పాలకవర్గం ఎలాంటి ఇబ్బంది కర ఘటనలు ఏర్పడక ముందే ఈ సమస్యపై చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా ఆరో వార్డు కౌన్సిలర్ శ్రీపతి నరేష్ మాట్లాడుతూ హౌసింగ్ బోర్డ్ కాలనీలోని వీధి కుక్కలు చాలా ఉన్నాయని ప్రజలను చిన్న పిల్లల మీదకి కరుస్తున్నాయని స్థానిక వార్డు ప్రజలు నా దృష్టికి తీసుకురాగా వెంటనే ఉదయం మున్సిపల్ సిబ్బంది సహకారంతో కుక్కలు పట్టే వాళ్లను పిలిచి వీధి కుక్కలను అన్ని బంధించి తీసుకెళ్లడం జరిగిందని అన్నారు.ఈ విషయంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# మహేష్ ఫ్యాన్స్ గెట్ రెడీ..



సూపర్ స్టార్ మహేష్ బాబు భార్య నమ్రత గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. అయితే ఈమె ఒకప్పటి స్టార్ హీరోయిన్. అంతేకాదు మోడల్ కూడా. మోడల్ గా తన కెరీర్ ని ప్రారంభించిన నమ్రత ఆ తర్వాత సినిమాల్లో నటించే అవకాశాన్ని అందుకొని స్టార్ హీరోయిన్గా గుర్తింపు సంపాదించుకుంది. 1998లో జబ్ ప్యార్ కిస్ హోత హై సినిమాతో బాలీవుడ్ లో కూడా పలు సినిమాల్లో నటించింది. అలా చాలా తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్గా వెలుగొందింది. ఈ సినిమా తర్వాత తనకే బాలీవుడ్ లో వరుస సినిమాల్లో నటించే అవకాశం వస్తున్న సమయంలో తెలుగులో మహేష్ బాబు వంశీ కాంబోలో వచ్చిన సినిమాలో హీరోయిన్ గా నటించే అవకాశాన్ని దక్కించుకుంది. ఈ సినిమాతోనే టాలీవుడ్ కి పరిచయమైంది నమ్రత. మొదటి సినిమా తోనే హీరోయిన్గా మంచి గుర్తింపు తెచ్చుకున్నప్పటికీ ఆ సినిమాతో విజయాన్ని మాత్రం అందుకోలేకపోయింది. ఈ సినిమా తర్వాత అంజి సినిమాలో నటించిన ఆమె మహేష్ బాబుతో నటించిన మొదటి సినిమాతోనే ఆయనతో ప్రేమలో పడిపోయింది. ఆ తర్వాత మహేష్ తో పెళ్లి బంధం లోకి అడుగు పెట్టింది. పెళ్లి తర్వాత ఒక్క సినిమా కూడా చేయలేదు. తనకి చాలా సినిమా ఆఫర్లు వచ్చినప్పటికీ వాటన్నిటినీ రిజెక్ట్ చేసింది. హీరోయిన్ గా తన కెరీర్ ను పక్కన పెట్టేసి కుటుంబాన్ని చేసుకుంటుంది. అయితే ఫుల్ బిజీ బిజీగా గడుపుతున్న నమ్రతకు సంబంధించిన ఓ వార్త.. ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. దాదాపు 20 ఏళ్ల తర్వాత.. ఆమె సినిమాల్లోకి రీ ఎంట్రీ ఇవ్వనుందని జోరుగా ప్రచారం సాగుతోంది. ప్రముఖ ఫ్యామిలీకి చెందిన ఓ యంగ్ హీరో సినిమాలో నమ్రత కీలక పాత్రలో నటించనుందని టాక్ వినిపిస్తోంది. అంతే కాదు.. నెగిటివ్ షేడ్స్ ఉన్న రోల్ లో ఆమె కనిపించనుందని కూడా వార్తలు వినిపిస్తున్నాయి. దీంతో నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. కొందరు వెల్ కమ్ బ్యాక్ మేడమ్ అంటూ కామెంట్లు పెడుతున్నారు..!!

# మెప్పించే పేక మేడలు



‘పేక మేడలు’ సినిమాతో తొలిసారిగా తెలుగులో హీరోగా పరిచయమవుతున్నారు వినోద్ కిషన్. గతంలో ‘నా పేరు శివ’, ‘అంధగారం’, ‘గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి’ సినిమాల్లో ఆయన నటించారు. అనూష కృష్ణ హీరోయిన్గా నటిస్తోంది. ‘ఎవరికి చెప్పొద్దు’ సినిమాతో క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ సంస్థను స్థాపించి విజయాన్ని అందుకుని, ఇప్పుడు ఈ సినిమాతో ప్రేక్షకులు ముందుకు వస్తున్నారు నిర్మాత రాకేష్ వర్రే. మంగళవారం ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ఈ నెల 19న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ నీలగిరి మామిళ్ల మాట్లాడుతూ, ‘ప్రతి ఒక్కరి జీవితంలో జరిగే సంఘటనలకి దగ్గరగా ఈ సినిమాను చూపిస్తున్నాం. ఫ్యామిలీలో ఉండే ఎమోషన్స్తో పాటు ఎంటర్టైన్మెంట్ని కూడా ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు’ అని అన్నారు. ‘వినూత్న రీతిలో క్యూఆర్ స్కాన్తో ప్రమోషన్ స్టార్ట్ చేసాం అది పెద్ద సక్సెస్ అయింది. ఇంకా సినిమా రిలీజ్ వరకు ఇలా వినూత్నంగా ప్రమోషన్స్ చేస్తూనే ఉంటాం. ఇదొక కామెడీ సినిమా మాత్రమే కాదు ఇందులో ఆడవారు మగవారికి ఇస్తున్న సపోర్ట్ గురించి ఒక కోర్ పాయింట్తో మంచి కాన్సెప్ట్ సినిమాని తీశాం. ఎంటర్టైన్మెంట్తో పాటు ఎమోషనల్గా కూడా ఉంటుంది’ అని నిర్మాత రాకేష్ వర్రే చెప్పారు. హీరో వినోద్ కిషన్ మాట్లాడుతూ, ‘తెలుగులో హీరోగా ఇది నా మొదటి సినిమా. నన్ను సెలెక్ట్ చేసుకున్న నా డైరెక్టర్ నీలగిరికి, ప్రొడ్యూసర్ రాకేష్ వర్రేకి కృతజ్ఞతలు’ అని తెలిపారు. ‘ప్రేక్షకులు మా సినిమాని ఆదరించి మంచి సక్సెస్ చేస్తారని ఆశిస్తున్నాను’ అని హీరోయిన్ అనూష కృష్ణ అన్నారు.

# ఆ కుర్రాడే తోపు?



టీమిండియాలో కొత్త ప్రతిభకు కొదవ లేకుండా పోయింది అన్న విషయం తెలిసిందే. అద్భుతమైన ఆటతీరుతో ఎప్పుడూ యువ ఆటగాళ్లు తెరమీదకి వస్తూనే ఉన్నారు. ఈ క్రమంలోనే వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ టీమిండియా ఫ్యూచర్ స్టార్స్ తామే అన్న విషయాన్ని చెప్పకనే చెబుతూ ఉన్నారు అన్న విషయం తెలిసిందే. కొంతమంది దేశవాళి క్రికెట్లో వివిధ టోర్నిలలో రాణిస్తూ అదరకొడుతూ ఉంటే ఇంకొంతమంది క్యాష్ రిచ్ లీగ్ గా పిలుచుకునే ఐపీఎల్లో ఛాన్సులు దక్కించుకుంటూ తమ ప్రదర్శనతో అందరి దృష్టిని తమ వైపుకు తిప్పుకుంటున్నారు. ఇలా ఈ ఏడాది ముగిసిన ఐపీఎల్ సీజన్ లో అద్భుతమైన ప్రదర్శన చేసిన యువ ఆటగాళ్లు చాలామంది ఉన్నారు. అలాంటి వారిలో అభిషేక్ శర్మ ఒకరు అన్న విషయం తెలిసిందే. తన విధ్వంసకరమైన ఆటతీరుతో ఐపీఎల్ లో సూపర్ హీరోగా మారిపోయాడు ఈ యంగ్ ప్లేయర్. అంతర్జాతీయ క్రికెట్ ఆడిన అనుభవం లేకపోయినప్పటికీ.. ఎక్కడ ఒత్తిడి తడబాటు లేకుండా వీర బాదుడు బాదేశాడు అని చెప్పాలి. ఈ క్రమంలోనే ఈ కుర్రాడి బాదుడు ముందు మహామహా బౌలర్లు సైతం బెంబేలెత్తిపోయారు. ఇంకేముంది అతనికి కలెక్టర్ టీమ్ ఇండియాలో ఛాన్స్ ఇవ్వగా ఇప్పుడు జింబాబ్వేతో జరుగుతున్నటు టీ20 సిరీస్ లోనూ అతను అదరగొడుతున్నాడు. ఇక ఇటీవల జింబాబ్వే తో జరిగిన టి20 మ్యాచ్ లో కూడా సూపర్ సెంచరీ చేసి చెలరేగిపోయాడు అన్న విషయం తెలిసిందే. ఇక ఏడాది మొత్తం అభిషేక్ శర్మ అత్యుత్తమంగా రాణిస్తున్నాడు. ఈ సంవత్సరంలో అభిషేక్ శర్మ 18 టీ20 మ్యాచ్ లు ఆడి ఏకంగా 584 పరుగులు చేశాడు. స్ట్రైక్ రేట్ ఏకంగా 200 కు పైగా ఉండడం విశేషం. పొట్టి క్రికెట్లో మరో క్రికెటర్ స్ట్రైక్ రేట్ ఈ రేంజ్ లో లేదు. రాసేల్ 199.47 జాక్ ప్రెజర్ 194.13, ట్రావిస్ హెడ్ 176.24 ఫిలిప్ సాల్ట్ 172.47 స్ట్రైక్రెట్ తో ఉండగా అందరికంటే అత్యధిక స్ట్రైక్ రేటుతో కొనసాగుతున్నాడు యంగ్ ప్లేయర్ అభిషేక్ శర్మ.

# టీమిండియా చేతిలో చిత్తయిన దక్షిణాఫ్రికా..



టీమిండియా దూకుడుతో 3 వన్డేల సిరీస్ క్లీన్ స్వీప్ అయింది.. ఏకైక టెస్ట్ భారత్ వశమైంది. చివరికి టి20 సిరీస్ సమం అయింది. దీంతో దక్షిణాఫ్రికాకు రిక్త హస్తమే మిగిలింది. చెన్నై వేదికగా మంగళవారం జరిగిన చివరి టి20 మ్యాచ్ లో భారత్ ఏకపక్ష విజయాన్ని సాధించింది. తొలి టి20 మ్యాచ్లో విజయం సాధించిన దక్షిణాఫ్రికా జట్టు.. ఈ సిరీస్ పై కన్నేసింది. అయితే రెండవ టి20 మ్యాచ్ వర్షం వల్ల రద్దయింది. మూడవ టి20 మ్యాచ్ లో భారత్ తిరుగులేని విజయం సాధించింది.. ఏకంగా 10 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా జట్టును మట్టి కరిపించింది. టీమిండియాలో ముందుగా పూజా వస్త్రాకర్ (4/13), రాధా యాదవ్(3/6), అరుంధతి రెడ్డి (1/14), శ్రేయాంక పాటిల్(1/19), దీప్తి శర్మ(1/21)దూకుడుగా బౌలింగ్ చేయడంతో దక్షిణాఫ్రికా 17.1 ఓవర్లలో 84 పరుగులకే ఆలౌట్ అయింది.. బ్రిట్స్ చేసిన 20 పరుగులే సౌత్ ఆఫ్రికా జట్టులో అత్యధిక స్కోరు. బోష్(17), కాప్(10) రెండంకెల స్కోర్ చేశారు. భారత బౌలర్ల ధాటికి ఒకానొక దశలో దక్షిణాఫ్రికా జట్టు 50 పరుగులకే కుప్పకూలుతుందని అందరూ భావించారు. కానీ చివరి దశలో ఆ జట్టు బ్యాటర్లు కాస్త ప్రతిఘటించడంతో ఆమాత్రం స్కోరైనా చేయగలిగింది. మైదానంపై లభిస్తున్న తేమను సద్వినియోగం చేసుకున్న భారత బౌలర్లు.. నిప్పులు చెరిగే బంతులు వేశారు. కనీసం బంతిని టచ్ చేసేందుకు కూడా దక్షిణాఫ్రికా బ్యాటర్లు భయపడ్డారంటే.. భారత జట్టు బౌలింగ్ ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. తొలి టీ 20 మ్యాచ్లో దక్షిణాఫ్రికా బ్యాటర్లు అదరగొట్టారు. కానీ మూడవ టి20 మ్యాచ్ విషయానికి వచ్చేసరికి తేలిపోయారు. ముఖ్యంగా నాలుగో ఓవర్లో లారా (9) ను ఔట్ చేసి దక్షిణాఫ్రికా పతనానికి శ్రేయాంక పాటిల్ నాంది పలికింది.. ఆ తర్వాత పూజ, రాధా దక్షిణాఫ్రికా బ్యాటర్లను వణికించారు. వికెట్ల మీద వికెట్లు తీస్తూ సఫారీ జట్టును కకా వికలం చేశారు. ఇక సౌత్ ఆఫ్రికా విధించిన 85 పరుగుల విజయ లక్ష్యాన్ని భారత జట్టు 10.5 ఓవర్లలో ఒక్క వికెట్ కూడా కోల్పోకుండా ఛేదించింది. స్మృతి మందాన (54లిబీ 40 బంతుల్లో 8 ఫోర్లు, రెండు సిక్సర్లు) దూకుడుగా బ్యాటింగ్ చేయగా.. షెఫాలీ వర్మ (27లిబీ 25 బంతుల్లో మూడు ఫోర్లు) నిదానంగా బ్యాటింగ్ చేయడంతో టీమిండియా అత్యంత సులువుగా లక్ష్యాన్ని ఛేదించింది. ఈ విజయంతో మూడు టి20 మ్యాచ్ ల సిరీస్ ను హర్మన్ ప్రీత్ సేన 1-1 తో సమం చేసింది. అంతకుముందు టీమిండియా మూడు వన్డేల సిరీస్ క్లీన్ స్వీప్ చేసింది. ఏకైక టెస్టులోనూ 10 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది.